


కాషియర్ గడ గడ వణికిపోతున్నాడు. బ్యాంకులో అందరూ స్తంభించి నిలబడిపోయారు. బ్యాంకు మానేజర్ ఫోన్ చెయ్యాలన్న విషయం కూడా మర్చిపోయాడు.

అంతకు పది నిమిషాలు ముందు ఫుల్ సూట్, నల్ల కళ్ళజోడు, పిల్లి గడ్డం వున్న ఒక వ్యక్తి వచ్చాడు బ్యాంకులోకి. నేరుగా కౌంటర్ వద్దకు నడిచి చెక్ తీసిచ్చాడు. చెక్కు వంక చూసి విశ్రాంతపోతూ టోకెన్ యిచ్చాడు కౌంటర్‌లో వున్నతను. టోకెన్ తీసుకున్న పిల్లిగడ్డం వ్యక్తి అక్కడినుండి క్యాష్ కౌంటర్ దగ్గరికి వెళ్ళాడు. డిజిటల్ డిస్ ప్లేలో వున్న నంబరు చూసి నాలుగడుగులు వెనక్కి వేసి ఎదురుగా వున్న సోఫాలో కూర్చున్నాడు.

రెండు నిముషాలు తర్వాత మరో వ్యక్తి లోపలికి వచ్చాడు. అతడూ నేరుగా కాష్ కౌంటర్ దగ్గరికి వెళ్ళాడు. అతని చేతిలో గన్ వుంది!

గన్ పట్టుకున్న వ్యక్తి సోఫాలో కూర్చున్న వ్యక్తితో ఏదో మాట్లాడుతున్నాడు. సోఫాలో కూర్చున్నతను చేతులతో సైగలు చేస్తూ ఏదో చెబుతున్నాడు.

గన్ పట్టుకున్నతను నిటారుగా నిలబడ్డాడు. ఇప్పుడు గన్ కాషియర్‌కు గురిపెట్టబడి వుంది. కాషియర్ లెక్క పెడుతున్న నోట్లు అతడి చేతిలోంచి జారిపడ్డాయి. అవి తీసుకోడానికి వంగాడతడు. నేల మీద పడ్డ నోట్లు ఏరి పైకి తీసేసరికి గన్ పట్టుకున్న వ్యక్తి స్థిరిగా కాష్ కౌంటర్ ముందు నిలబడి వున్నాడు. కాషియర్‌కు ముచ్చెమటలు పట్టేశాయి.

"ఇంకా ఎంత సేపు" అన్నాడు గన్ వ్యక్తి.

కాషియర్ నోట మాట రాలేదు. గన్ వ్యక్తి గొంతు విని వణికిపోయాడు. అతడి గొంతు చాలా బొంగురుగా వుంది.

"......'.....' య్యా! చి ....త్తం" అన్నాడు తడబడుతూ కాషియర్.

"త్వరగా ..." అన్నాడు గన్ వ్యక్తి.

బ్యాంకులో అందరూ బిగుసుకుపోయినట్లు నిలబడి పోయారు. వాళ్ళు వచ్చిన పని మర్చిపోయినట్లు. మంత్ర ముగ్ధుల్లా...

ఒకరిద్దరు లోపలికి రాబోయి లోపల జరుగుతున్నదంతా గమనించి అటు నుంచటే చల్లగా జారుకున్నారు.

మంచినీళ్ళిచ్చే వంకతో బాయ్ మానేజర్ దగ్గరికి నడిచాడు.

"సార్!" అన్నాడు మెల్లిగా.

ఏమిటన్నట్లు చూశాడు మానేజర్.

"ఫోన్ చెయ్యండి సార్, పోలీసులకు" అన్నాడు బాయ్ మంచినీళ్ళ

గ్లాసు అతని ముందు పెడుతూ.

"మనం పోలీసులకు ఫోన్ చేస్తున్నామన్న విషయం గమనిస్తే వాళ్ళు మనల్ని కాల్చేస్తారు. మనతోపాటు ఎంతోమంది కష్టమర్సు కూడా వున్నారు. ఎలాగైనా వాళ్ళను మరికాసేపు కదలకుండా వుండేలా చూడు. మనం యింతమందిమివున్నా, వాళ్ళిద్దరు చాలు మనల్ని పచ్చడి చెయ్యడానికి. పోలీసులకు ఫోన్ చేసిన విషయం వాళ్ళు గమనించకుండా వుండేలా చూడు చాలు. మిగిలినది నేను మానేజ్ చేస్తాను. అన్నాడతను. అతని వుద్యోగమే మానేజర్.

"సరే సార్" మెల్లిగా అన్నాడు బాయ్.

"ముందా పనిమీదుండు" అన్నాడు మానేజర్.

"సార్! ఒక అయిడియా! ఆ సోఫాలో కూర్చున్న పిల్లి గడ్డం అతనికి కాఫీ యిస్తాను బా ...గా వే...డిగా. ఫోన్ చాల స్లోగా పెడ్తాను. అప్పుడు కాఫీ చల్లారడానికి చాలా టైం పడ్తుంది. ఈలోగా పోలీసులకు విషయం తెలియజెయ్యవచ్చు" అన్నాడు బాయ్.

ఆ సమయంలో మానేజర్కు బాయ్ ఆపద్బాంధవుడిలా తనకు కర్తవ్యాన్ని వుపదేశించడానికి వచ్చిన అపర శ్రీకృష్ణ పరమాత్ముడిలా కన్పించాడు.

మెచ్చుకోలుగా బాయ్‌వంక చూస్తూ "ఐడియా బాగుంది కమాన్! క్విక్" అన్నాడు మానేజర్.

బాయ్ లోపలికి వెళ్ళి ఎలక్ట్రిక్ స్టవ్ మీద కాఫీ బాగా మరిగించాడు. ఫ్లాస్కులో పోస్తుండగా ధాం అన్న శబ్దం విన్పించింది. ఫ్లాస్కు చెయ్యి జారింది.

"బాబోయ్ బాంబు" అని అరుస్తున్నారు. హాల్లో వాళ్ళు.

బాయ్ హాల్లోకి వెళ్ళాడు. అందరూ హడావిడిగా సీట్లలోంచి లేచి బయటికి వెళ్ళడానికి ప్రయత్నించారు. కాషియర్ కూడా.

"ఆగు" అన్నాడు గన్ వ్యక్తి.

కాషియర్ బిక్క మొహం వేసుకు చూశాడు.

"ముందు డబ్బిచ్చి తర్వాత వెళ్ళు" అన్నాడు గన్ వ్యక్తి.

"బాంబు ... బాంబు ..." అన్నాడు కాషియర్ స్ట్రాంగ్ రూం వంక చెయ్యి చూపిస్తూ

"బాంబు లేదు. ఏం లేదు. ముందు డబ్బివ్వు." అన్నాడు గన్ వ్యక్తి పిల్లి గడ్డం వంక చూస్తూ ... పిల్లి గడ్డం తలాడించాడు.

బాయ్ మళ్ళీ మెల్లిగా మానేజర్. దగ్గరికి నడిచాడు.

"సార్ ఫ్లాస్కు చేతిలోంచి జారి పడి పగిలిపోయింది." అన్నాడు. "కాఫీ అయిడియా ఫెయిలయినట్లే ..."

"పగిలిపోతే పోయిందిలే. అక్కడ ఏమిటి అందరూ హడావుడి పడిపోతున్నారు?" అన్నాడు మానేజర్. అతడు కూర్చుంటే గ్లాస్ గది అయినా సౌండ్ ప్రూఫ్. అతనికి ధాం అన్న శబ్దం వినబడలేదు.

"బ్యాంకులో ఎక్కడో బాంబు పేలింది సార్. ఆ శబ్దం స్ట్రాంగ్ రూం నుంచి వచ్చింది " బాయ్ చెప్పాడు.

మానేజర్ కంగారుపడ్డాడు.

"కంగారు పడకండి సార్. అది స్ట్రాంగ్ రూమే కదా" అన్నాడు బాయ్

మానేజర్ స్తిమిత పడ్డాడు.

"హాల్లో అందరూ భయపడి బయటికి వెళ్ళాలని చూస్తున్నారు" మళ్ళీ బాయ్ అన్నాడు.

"మరి వెళ్ళరేం"

బ్యాంకు టైం అయిపోవచ్చినందువల్ల మెయిన్ డోర్ లాక్ చేసి, సైడ్ డోర్ తలుపులు రెండూ చేరవేసి వాటి హాండిల్స్ లోంచి ఒక గొలుసు దూర్చి తాళం వేసి ఆ రెండు తలుపుల మధ్య గొలుసు క్రింద నుంచి ఒక్క మనిషి పట్టేంత చోటు వుంచుతారు. ఆ బ్యాంకులో. బాంబు భయానికి హడావుడిగా బయటికి వెళ్ళబోయిన ఓ లావుపాటి స్త్రీ ఆ తలుపులు సందులో యిరుక్కుపోయింది. ఆవిడ మూలంగా రాకపోకలు స్తంభించాయి.

"సరే నువ్వెళ్ళు. నేను పోలీసులకు ఫోన్ చేస్తాను అన్నాడు మానేజర్.

బాయ్ అతి తెలివిగా పోలీసుస్టేషన్ నంబరు తనకూ తెలుసన్న విషయం మానేజర్కు తెలియాలని 100 డయల్ చేశాడు.

"సార్! ఫోన్ కట్ చేశారు" అన్నాడు కంగారుగా.

మానేజర్ ఫోన్ ట్రై చేశాడు. డయల్ టోన్ కూడా రావడం లేదు. "అవును ఫోన్ కట్ చేశారు" అన్నాడు.

"ఇప్పుడెలా" అన్నాడు బాయ్.

ఒక్క మానేజర్ రూం మాత్రం ప్రశాంతంగా వుంది. మిగిలిన బ్యాంకు అంతా అతలకుతలంగా వుంది. ఓ వేపు బాంబు భయం మరో వేపు బయటికి వెళ్ళే దారి మూసుకుపోయింది.

గన్ వ్యక్తి కాషియర్‌తో "ఇంకా ఎంతసేపయ్యా! అసలు ఎంతుంది బ్యాంకులో" అన్నాడు. కాషియర్ కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు. ఆ కర్చీఫ్ ఏటిలో వేసిన బట్టలు నీళ్ళు కక్కినట్లు చెమట కక్కుతోంది.

"ఏమిటి ఆలస్యం! త్వరగా కానీ" అన్నాడు పిల్లి గడ్డం.

"సార్! ఆ డోర్‌లో నిలబడి నావిడ కూడా వీళ్ళ తాలూకానేమో సార్! అందుకే ఎవర్ని బయటికి పోనీకుండా అడ్డం నిలబడింది" అన్నాడు బాయ్.

"నిజమే సుమా" అన్నట్లు చూశాడు కాషియర్.

"రక్షించండి, కాపాడండి, హెల్ప్" ఎవరికి వచ్చిన భాషలో వారు, ఎవరికి తోచిన రీతిలో వారు బయటి నుంచి సహాయం కోసం అర్థిస్తున్నారు.

వాళ్ళలా అరవడం చూసి పిల్లి గడ్డం వ్యక్తి "ఎందుకలా అరుస్తారు" అన్నాడు గట్టిగా.

అందరూ నోళ్ళు చేతులతో మూసేసుకున్నారు. ఒక అమ్మాయి మాత్రం నోరు తెరవకుండానే "కుక్కు క్కుక్కు, కూకూ కుక్కు" అని అరుస్తున్నది. ఆమెను పిల్లి డ్డం వ్యక్తి కానీ, గన్ వ్యక్తి కానీ ఏమీ అనలేదు.

"మనం వాళ్ళకు డబ్బిస్తున్నట్లు చూచిందంట ఆ దారిలో నిలబడ్డ ఆవిడ వెళ్ళిపోతుంది. అప్పుడు నువ్వు చిన్నగా తప్పించుకుని పోలీసులకు విషయం తెలియజెయ్యి. నీ కాఫీ అయిడియా బాగుందన్నానుగా. నేను కలిపిస్తాను కాఫీ అతడికి. నువ్వు పోలీసులను తీసుకువచ్చిందాక అతణ్నే వాడి కాఫీ తాగిస్తూ నిలబెడతాను." అన్నాడు మానేజర్. " ముందు కాషియర్‌తో చెప్తు, వాళ్ళకు డబ్బిస్తున్నట్లు నటించమని."

బాయ్ మానేజర్ రూం నుంచి

## హతుడు – హతురాలు

ఆత్మలు చిదిగి పోతాయి.
అంచుతెగిన కాటుక గోళాలు,
నీ గొంతులోకి నీ హతుడి స్వర నాళాల్నింకా వేలాడుతూ....
మెలి తిరిగిన వెన్నెముక – నులిమిన నీటి బుడగ
సముద్ర గర్భంలో కుప్పగా కూలిన కలల దొన్నెలు
పాముచర్మం మీద జారే నీటి బొట్టు స్పర్శ
నా వేదిక మీద ఆకాశంలో చెమ్కీ అక్షింతల ఉబలాటం
రెప్పల్లో అలికిడి లేదు– కంటికింది నీడల్ని చదూదామంటే
గూడు కూలిన కన్నీటి దగ్గర లంగరలానే ఉంది
కర్పూర కాటుక కనుగుడ్లకి రాస్తూ ఒక్కేడ్పు ఇవ్వు
నిన్ను నాకోసం హతురాలివి కమ్మంటున్నాను
నన్ను హతం చేసే స్పర్శలో పరాధీన బానిస కన్నీరుకోసం
నా ఈ పరిధుల్ని పగలగొట్టుకుంటాను
చీకటి పూలతో నా ఆత్మకి శ్రద్ధాంజలి పాడుకొని ....
తిరిగి నిన్నెదుక్కొంటాను

–బి. ఎస్. ఎమ్. కుమార్.

బయటికి వచ్చి కాషియర్ దగ్గరికి వెళ్ళి అతడి చెవిలో ఏదో చెప్పాడు.

ఇంతలో గన్ వ్యక్తి "ఏమిటాలస్యం" అన్నాడు.

"అబ్బే! ఆలస్యమేం లేదు. ఇచ్చేస్తున్నా" అంటూ నోట్ల కట్టలు బయటికి తీశాడు కాషియర్. "ఏదీ మీ సంచీ కానీ, సూట్‌కేస్ కానీ వుంటే యిలా యివ్వండి డబ్బు అందులో వుంచుతాను" అన్నాడు.

"సంచీ, సూట్‌కేసూ ఎందుకయ్యా రెండు లక్షలకు" అన్నాడు పిల్లిగడ్డం.

"అబ్బే రెండు లక్షలు కాదు సార్. పాతిక లక్షలు పైనే వుంటుంది. మాది చాల పెద్ద బ్యాంకు రోజూ ఇరవై ముప్పై లక్షలకు తక్కువకాకుండా మారుతుంటుంది" అన్నాడు కాషియర్ గర్వంగా. బాయ్ అతని వంక గుర్రుగా చూశాడు. "పిల్ల కుంకా! నా ప్రాణాలు మాత్రమే కాదు నీ ప్రాణాలు కూడా వాళ్ళ చేతిలోనే వున్నాయని మర్చిపోకు అనుకుంటూ కాషియర్ కట్టలు తీస్తున్నాడు.

మానేజర్ సైగనందుకుని బాయ్ బయటికి వెళ్ళేదారి వద్దకు వెళ్ళాడు. దాదాపు పరుగెత్తుతున్నట్లు. అతడు పరుగెత్తడం చూసి మరో నలుగురు యిదుగురు అతని వెనకే పరిగెత్తారు. వెనకవాళ్ళు వేగంగా రావడంతో బాయ్ వెళ్ళి గుమ్మంలో అడ్డంగా నిలబడిన ఆమెను తోశాడు. ఆమె గుమ్మం అవతల పెళ్ళిపడేలోగా అప్పుడే అక్కడ ఆగిన స్కూటర్ మీద నుంచి ఎస్‌ఐ దిగి గుమ్మం దగ్గరికి వచ్చాడు. ఈవిడ వెళ్ళి ఆయన మీదపడింది. ఆయన అక్కడే పార్కు చేసి వున్న తన స్కూటర్‌మీద పడ్డాడు. స్కూటర్ పక్కగా వెళ్తున్న ఓ కుక్కపిల్ల కుయ్ మంటూ పారిపోయింది తప్పించుకుని.

యస్సై తేరుకుని డ్రస్సు దులుపుకుని లేచి నిలబడి "వాటీజ్ దిస్, ఏం జరుగుతోంది" అన్నాడు.

"బ్యాంకులో బాంబు" అన్నాడు బాయ్, లావుపాటి ఆవిడ తప్ప మిగిలినవాళ్ళు.

"సార్ బ్యాంకులో దొంగలు పడ్డారు" అన్నాడు బాయ్.

యస్సై లోపలికి వెళ్ళాడు.

యస్సైని చూచి ధైర్యం తెచ్చుకున్న కాషియర్ "సార్! దొంగలు సార్" అన్నాడు స్పృహ తప్పిపోయే ముందు క్లూ యిచ్చే వ్యక్తిలా.

యస్సై గన్ వ్యక్తి దగ్గరికి వెళ్ళి "ఐసీ, మీరేనా దొంగలు" అన్నాడు.

గన్ వ్యక్తి "దొంగలా!! సార్! ఆయనా..." అని పిల్లిగడ్డం వ్యక్తికేసి చూపాడు.

యస్సై పిల్లి గడ్డం వంక చూచి "మీరూ... " అన్నాడు.

"నేను సరే! ఏమిటి బ్యాంకులో అందరూ హడావుడి పడిపోతున్నారు. కంగారు పడిపోతున్నారు. నాకేం అర్థం కావడం లేదు" అన్నాడు పిల్లి గడ్డం.

"నీ కర్థం కావడం లేదా. తుపాకి చూపించి డబ్బుకొట్టెయ్యాలనుకోలేదూ నువ్వు! పైగా స్ట్రాంగ్ రూంలో బాంబు వేసింది నువ్వు కాదూ" అన్నాడు అప్పుడే కాఫీ కప్పుతో వచ్చిన మానేజర్.

పిల్లిగడ్డం వ్యక్తి నవ్వాడు పకపకా, వికవికా, పొట్ట చెక్కలయ్యేలా.

"నేనూ ..." అని తన విజిటింగ్ కార్డు తీసి చూపించాడు. "రెండు లక్షలకు చెక్కురాసిచ్చి టోకెన్ తీసుకున్నాను. ఎప్పుడూ నేను రాను. ఈసారి తప్పనిసరై నేను రావలసి వచ్చింది. నేను కోట్లమీద వ్యాపారం చేస్తుంటాను. పర్సనల్ సెక్యూరిటీ కోసమని లైసెన్సు తీసుకుని గన్నూ, సెక్యూరిటీ పెట్టుకున్నాను. ఈ నంబరు డిస్‌ప్లేలో వస్తుందని చూస్తుండగా యింతలో యిక్కడ యిలా జరిగింది."

"సార్ మనం టోకెన్ యివ్వలేదేమో సార్!" అన్నాడు గన్ వ్యక్తి.

"అవును మరి! నంబర్ డిస్‌ప్లేలో కనిపిస్తే కదా యివ్వాలి అని నేను చూస్తూ కూర్చున్నాను" అన్నాడు పిల్లి గడ్డం జేబులోంచి టోకెన్ తీస్తూ.

"ఈ నంబరు నేను డిస్‌ప్లే చేశాను సార్" అని కాషియర్ డిస్‌ప్లే వంక చూచి గతుక్కుమన్నాడు. అక్కడ లైట్లు వెలగడం లేదు. "మిషన్ చెడిపోయిందేమో సార్" అన్నాడు. బుర్ర గోక్కుంటూ.

"అదీ సంగతి. టోకెన్ నంబరు పిలవలేదని నేను కూర్చుంటే టోకెన్ యివ్వకుండా గన్ పట్టుకుని డబ్బు గురించి అడిగేసరికి మీవాడు కంగారు పడిపోయి వుంటాడు. నాకు కొంచెం అర్జంటు పని వున్నందువల్ల మా గన్‌మ్యాన్‌ని ఏమయిందో అడిగి రమ్మన్నాను" వివరించాడు పిల్లిగడ్డం.

"అలాగా" అన్నాడు కాషియర్ తేలిగ్గా నిట్టూరుస్తూ

"మరి ఫోన్ పని చెయ్యడం లేదే" అన్నాడు మానేజర్.

"అదా. డెడ్ అయ్యుంటుంది. ఇప్పుడు చూడండి. ఇందాక స్టేషన్‌లో కూడా ఫోన్ పనిచెయ్యలేదు" అన్నాడు యస్సై.

"అయితే లోపల బాంబు పేలిన విషయం .." అంది నోర్మూసుకున్నప్పుడు మూగగా మాట్లాడిన అమ్మాయి.

"ఇందాక కాఫీ పెడ్తున్నప్పుడు ఎవరో బాంబు అన్నట్లు వినిపించింది. కంగారులో ఫ్లాస్కు కింద పడి పగిలింది. అది బాంబు పేలిన శబ్దమో, ఫ్లాస్కు పగిలిన శబ్దమో ఆలోచించే బుర్రలేదప్పుడు" అన్నాడు బాయ్.

"భలేవాడివే" అంది లావుపాటి ఆవిడ.

"ఈవిడేనా దొంగల తాలూకు అన్నావు" అన్నాడు మానేజర్ బాయ్‌తో.

"నేనా! నన్ను దొంగ అన్నాడా ..." దాదాపు కొట్టినంత పని చేసింది ఆవిడ.

"మరి మీరు తలుపుకు అడ్డంగా నిల్చుంటే ..." అన్నాడు బాయ్ భయం భయంగా.

"నిలబడలేదయ్యా, గొలుసులతో తలుపులు కట్టేసి వున్నాయి కదా. చిన్నగా దూరేసరికి గట్టిగా పట్టేశాయి." అందావిడ.

"పోలీసుల మీద ఎన్ని జోకులు, కార్టూన్లు వస్తున్నా యింకా పోలీసులను చూచి ధైర్యం తెచ్చుకునే వాళ్ళున్నారంటే..." అని యస్సై అంటుండగానే

"అది మీలాంటి వాళ్ళ చలవేసార్" అన్నాడు బాయ్. మానేజర్ చేతిలో కాఫీ కప్పు యస్సైకి అందిస్తూ.




